29 తుకు.. తుకు!

మండలంలోని పలు శిథిల భవనాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆలనా పాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఏ భవనం ఎప్పుడు కూలుతుందో.. ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే వాటిని తొలగించాలని కోరుతున్నారు.

శిథిల భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు • భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు • పట్టించుకోని అధికారులు


గొడ్డువాని పాలెంలో అంగనాడీ కేంద్రం వద్ద భవనంలో ప్రమాదకరంగా ఉన్న మర్రిచెట్టు


శిథిలావస్థకు చేరిన యాతపాలెం తుపాను భవనం

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని గొడ్డువానిపాలెం, యాతపాలెం, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకుని ప్రజల అవసరాల కోసం రెండు దశాబ్దాల కిందట సామాజిక భవనాలు నిర్మించారు. అప్పట్లో ఈ భవనాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు ఆశ్రయం కల్పించేందుకు గానూ నిర్మించారు. అంతవరకూ బాగానే ఉన్నా.. భవనాలకు సంబంధించి కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం నెరవేరకపోగా అక్రమ కార్యకలాపాలకు నిలయాలుగా మారిపోయాయి. దీంతో రానురాను ఆ భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి పడిపోతుండడంతో ఎప్పుడు కూలిపోతాయో అన్న భయం అందరిలోనూ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఆ భవనాల్లో కొన్నింటిని అంగన్‌వాడీ కేంద్రాలుగా, మరికొన్ని పశువులకు ప్రథమ చికిత్స అందించే కేంద్రాలుగా వినియోగిస్తున్నారు.

భయం గుప్పిట్లో

ఏళ్లనాటి కట్టడాలు కావడంతో కూలిపోయే ప్రమాదం అధికంగా కనిపిస్తోంది. దీని వల్ల ఆయా భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు భయం గుప్పిట్లో నడుస్తున్నాయి. కేంద్రాలకు వచ్చే చిన్నపిల్లలపై ఎప్పుడు ఏ పెచ్చు ఊడి పడిపోతుందనే భయంతో నిర్వాహకులు,చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు చేపట్టాల్సిన జిల్లా యంత్రాంగం సైతం పట్టించుకున్న పాపాన పోలేదు.

కానరాని నిర్వహణ

కనీసం సున్నం వేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. సామాజిక భవనాలు ఏ సమయంలోనైనా కూలిపోతే అధికంగా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గొడ్డువానిపాలెం సామాజిక భవనం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆ భవనం నుంచి పుట్టుకొచ్చిన మర్రిచెట్టు పెద్ద వృక్షంగా మారిపోవడంతో ఏక్షణాన్నైనా కూలిపోయే ప్రమాదం ఉంది. ఆ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి సుమారు 20–25 మంది పిల్లలు వస్తున్నారు. అందువల్ల భవనానికి ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే పిల్లల పరిస్థితి ఏంటో తమకే అర్థం కావడం లేదని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏం జరుగుతుందో..



అంగన్‌వాడీ కేంద్రానికి బాలింతలు, గర్భిణులు వస్తుంటారు. అయితే భవనం శిథిలం కావడంతో ఎప్పుడు కూలిపోతుందో, ఏ క్షణం ఏం ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. భవనంలోకి చెట్టు దూసుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొని ఉంది. – పేర్ల అప్పారావు, చైర్మన్, కల్చర్ ఫౌండేషన్

గాలి వీస్తే భయం

నా మూడేళ్ల కుమారుడిని ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నాను. వాతావరణంలో మార్పు రాగానే ఏ మాత్రం గాలివీచినా ఈ భవ నం పడిపోతుందనే భయంతో పరుగున వెళ్లి మా బాబును తీసుకువచ్చేస్తున్నాను. పాత భవనాన్ని తొలగించి కొత్తగా నిర్మించాలి.

–కె లక్ష్మి, పెదగంట్యాడ

కూలితే ప్రాణ నష్టం



గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న ఈ భవనం కూలితే ప్రాణనష్టమే. ఈ భవనం పాఠశాలకు ఆనుకుని ఉండడంతో విద్యార్థులు రాకపోకలు ఇటుగానే సాగిస్తుంటారు. దీంతో క్షణ క్షణం భయం భయంగా జీవిస్తున్నాం. అధికారులు స్పందించి ఇలాంటి భవనాలు తొలగించాలి.

– పేర్ల అమ్మోరు, గంగవరం


గంగవరం పాఠశాల ఆనుకుని శిథిలావస్థకు చేరిన తుపాను భవనం

ఫిర్యాదు చేసినా..

ఈ భవనాల స్థితిపై కేంద్రాల నిర్వాహకులు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. గంగవరం హైస్కూల్‌కు ఆనుకుని ఉన్న సామాజిక భవనం పరిస్థితి దారుణంగా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఇటు పాఠశాల సిబ్బంది, అటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్‌లో హిందీ సమర్థవంతంగా అమలు


సెమినార్‌లో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: టౌన్ అధికారిక భాషా అమలు కమిటీ(టోలిక్) సభ్య సంస్థల మద్దతుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ హిందీని సమర్థవంతంగా అమలు చేస్తుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే అన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్‌డీ సెంటర్‌లో 'తాజా హిందీ పార్లమెంటరీ కమిటీ ప్రశ్నపత్రం మరియు త్రైమాసిక ప్రగతి నివేదిక' అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ హిందీ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. హిందీని అమలు చేయడంలో స్టీల్‌ప్లాంట్ ఎల్లప్పుడూ ముందుంటున్నారు. హెచ్‌పీసీఎల్ జీఎం ధర్మవీర్ మాట్లాడుతూ ఇటువంటి సెమినార్ల వల్ల హిందీ భాష మరింత ప్రాచుర్యం పొందుతుందన్నారు. ఉక్కు హిందీ విభాగం జీఎం లలన్‌కుమార్, ఏజీఎం టి. హైమావతి, హెచ్‌పీసీఎల్ హిందీ నోడల్ ఆఫీసర్ జీవీవీఆర్ సురేష్‌తో పాటు టోలిక్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యారాడ తీరానికి గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదగంట్యాడ: మండలంలోని యారాడ తీరానికి మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో యారాడ తీరానికి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చిందని, అతని వయసు సుమారు 28 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఆ వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియడం లేదన్నారు. అతని వివరాలు తెలిసిన వారు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

జామెట్రీబాక్స్‌ల పంపిణీ

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని జీఎస్ ఫౌండేషన్ చిల్డ్రన్ హోమ్‌లోని బాలలకు సామాజిక కార్యకర్త జొన్నకూటి విజయ్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులు జామెట్రీ బాక్స్‌లు, పెన్సిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జొన్నకూటి గన్నమ్మ, కుమారి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్


మింది జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు

అక్కిరెడ్డిపాలెం: రక్షాబంధన్‌ను పురస్కరించుకుని షీలానగర్‌కు చెందిన బ్రహ్మకుమారీస్ పలు పాఠశాలల ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి తమ సోదరీ భావాన్ని తెలిపారు. మంగళవారం బ్రహ్మకుమారీలు శశి, దుర్గా దేవీ మింది జిల్లా పరిషత్ హై స్కూల్, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్, షీలానగర్‌లోని బీవీకే స్కూల్ ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి వారిని ఆశీర్వదించారు.

రాజీవ్ గాంధీకి నివాళి


రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీకి గాజువాక కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా గాజువాకలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణారావు, ఉరుకూటి అచ్చిబాబు, కొవిరి కోదండరావు, జెర్రిపోతుల ముత్యాలు, యరబాల భూలోక, ఎం.ఎస్. వర్మ, కట్ట అప్పారావు పాల్గొన్నారు.

కాలువలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్

తప్పిన పెను ప్రమాదం


కాలువలో పడిన ట్రాన్స్‌ఫార్మర్


ప్రధాన కాల్వ కోతకు గురవ్వడంతో కూలిన ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిర్మించిన సిమెంట్ దిమ్మ

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ప్రధాన మురుగు కాలువలో ఓ ఫంక్షన్ హాలుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ కాలువలోపడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. వడ్లపూడి ప్రధాన రహదారిని ఆనుకొని ప్రధాన మురుగు కాలువ పక్కన ప్రైవేటు ఫంక్షన్ హాలు నిర్మించారు. దీనికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలువను ఆనుకొని సిమెంట్ దిమ్మ నిర్మించి ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ప్రధాన కాలువలో మురుగుతీతతో పాటు అభివృద్ధి పనులు జీవీఎంసీ చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కాలువ కోతకు గురై ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నేలకొరిగిపోయింది. దీంతో దానిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలువలో పడిపోయింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా ఉంది. అయితే అప్పటికే నిర్మాణ పనులు ముగించుకొని పనివాళ్లు వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు సత్కారం


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సత్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, రాజారావు తదితరులు

పెదగంట్యాడ: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి బంగారు పతకాలు సాధించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆకాంక్షించారు. నగరంలోని పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఇటీవల నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మండలంలోని సత్య హెల్త్ కేర్ జిమ్‌లో మంగళవారం సత్కరించారు. సత్య కేర్ హెల్త్ జిమ్ అధినేత డాక్టర్ ఎస్.రాజారావు వద్ద శిక్షణ పొందిన మనపల్లి రాము బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 60 కిలోల విభాగంలో తేజ, 55 కిలోల విభాగంలో కండిపిల్లి వేణు సత్తా చాటి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ వీరంతా ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో నమ్మి అప్పారావు, గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, సంపూర్ణం, గంట్యాడ గోవిందరాజు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎల్అండ్‌టీ డీజీఎం శ్రీనివాసరావు

అగనంపూడి: బాలికల ఆరోగ్యంతో పాటు బాలికలకు ఆరోగ్య సూత్రాలు తల్లులు తెలియజేయాలని ఎల్అండ్‌టీ డీజీఎంలు ఈ.శ్రీనివాసరావు, రామకృష్ణ అన్నారు. బాలికలు రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఎల్అండ్‌టీ, సృజన స్రవంతి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాలికలకు ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు తల్లులు మాత్రమే అందివ్వగలరని, దీన్ని దృష్టిలో పెట్టుకొని తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బలవర్ధకమైన ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఎల్అండ్‌టీ సహకారంతో సృజన స్రవంతి సంస్థ అందించిన రూ.35వేల విలువైన శానిటరీ నాప్‌కిన్ల బర్నింగ్ మిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.కృష్ణారావు, సృజన స్రవంతి సంస్థ అధికారి హరనాథ్ మెహర్జీ, కమిటీ చైర్మన్ అట్టా శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కె.రమాదేవి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, ఆశాలత, అరుణ కుమారి పాల్గొన్నారు.

ఉక్కు అడ్మిన్ ముట్టడిని విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న తలపెట్టిన ఉక్కు అడ్మిన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్లాంట్‌లోని అని విభాగాల్లో నాయకులు పర్యటించి కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుత ప్లాంట్ పరిస్థితిని కార్మికులకు వివరించారు. యాజమాన్యం ఏకపక్షంగా, నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాలు ప్లాంట్‌కు ముడి పదార్థాలు అందకుండా చేయడం ద్వారా ఉత్పత్తిని దెబ్బతీస్తున్నారన్నారు. యాజమాన్యం కార్మికులపై బలవంతంగా రుద్దుతున్న ఆర్థిక ఆంక్షలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి నిర్వాసితులు అందరికీ న్యాయం చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, నరేష్‌కుమార్, సురేష్‌బాబు, కొమ్ము ప్రసాద్, పి.వి. రమణమూర్తి, బి. డేవిడ్, బి. అప్పారావు, వై.టి. దాస్, కాంట్రాక్టుల శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం


పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మంగళవారం పురస్కరించుకొని మంగళ గౌరీ వ్రతం, క్షీరాభిషేకం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గోవిందరెడ్డి దంపతులు అమ్మవారికి జరిగిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కుంచారావు, మునలయ్య రెడ్డి, వీర బాబు, గిడితూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషి ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక శివారు కర్రివానిపాలెంలోని సంతోషి ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సంతోషిమాతకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సంతోషిమాతను గ్రామ వీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాసరి లక్ష్మీ సన్యాసిరావు , గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీలయ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ


పసుమర్తి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విజేతలు

ఉక్కునగరం: స్థానిక శ్రీలయ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నాట్య ప్రదర్శనలో ప్రతిభ చూపి అవార్డు గెలుపొందారు. విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతిలో జాతీయ స్థాయి నృత్య, సంగీత ఫెస్టివల్ నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీలయ అకాడమీ నృత్య శిక్షకురాలు నరీనా బొమ్మాద్రి నేతృత్వంలో 20 మంది బాలికలు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. ప్రముఖ నాట్య గురువు పసుమర్తి వెంకట రమణ చేతుల మీదుగా అభినందన పత్రాలు అందుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

అక్కిరెడ్డిపాలెం: దోమల నియంత్రణతో ప్రాణాంతక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం 68వ వార్డు రాజీవ్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు విజృంభిస్తాయన్నారు. ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాలువల్లో పూడికలు లేకుండా చూసుకోవాలన్నారు.

'రన్ ఫర్ యాంటీ డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ


రన్‌ఫర్ యాంటీ డ్రగ్స్ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: మత్తు పదార్థాల నివారణ, మాదకద్రవ్యాల వల్ల అనర్థాలను వివరించడానికి ఈనెల 25న నిర్వహించనున్న రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ ర్యాలీని విజయవంతం చేయాలని అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు కోరారు. పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకంగా నిర్వహించనున్న ర్యాలీ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. యన మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ కార్తీక్ మాట్లాడుతూ పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు నిర్వహించనున్న రన్‌ఫర్ యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అగనంపూడి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, జేసీఐ వైజాగ్ స్టీల్ ఉపాధ్యక్షుడు ఎస్.రవికుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి సత్యసాయి భజన మండలి కోఆర్డినేటర్ బి.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధుల నుంచి రక్షణ


దేవాడ పీహెచ్‌సీ వద్ద మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: దోమలే అనేక వ్యాధులకు కారణమని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడ పీహెచ్‌సీ వద్ద మంగళవారం అంతర్జాతీయ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులను అరికట్టేందుకు దోమల నియంత్రణే ఉత్తమ మార్గం అన్నారు. 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్ రాస్ దోమల కారణంగా మలేరియా వ్యాపిస్తున్నట్టు కనుగొన్నారని అందుకు గుర్తుగా దోమల దినోత్సవంగా ప్రపంచ మంతా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం దేవాడ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది అన్నపూర్ణ, ఎం శ్రీనివాసరావు, గోపాలం, ఎస్ వెంకటలక్ష్మి, సునీత, గోవింద్ పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం ప్రధాన రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో బుధవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ కేదరీనాథ్ తెలిపారు. పైప్‌లైన్ మార్పిడి పనులు చేపట్టనున్న క్రమంలో వార్డు పరిధిలో నీటిసరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.